

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం

20 ఫిబ్రవరి 2026 పేజీలు : 08


## పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి
# సహకరించండి

- మార్చి 14న నేషనల్ లోక్ అదాలత్
- కమిషనర్ వైఓ నందన్

నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నులు, తాగునీటి కుళాయి పన్నులు, ఖాళీస్థలం పన్నుల ఎగవేత దారులపై క్రిమినల్ చర్యలు, రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగానికి న్యాయస్థానాల ద్వారా నోటీసులను పంపనున్నామని, సకాలంలో పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ వైఓ నందన్ సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కమిషనర్ మాట్లాడారు. నగరపాలక సంస్థకు చెల్లించవలసిన పన్ను బకాయి దారులకు సంబంధిత విభాగాల నుంచి నోటీసులను జారీ చేయనున్నామని, వారంతా నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో రాబోవు మార్చి నెల 14వ తేదీన శనివారం నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్‌కు హాజరై కోర్టు కేసులను మాఫీ చేసుకోవాలని కమిషనర్ సూచించారు. నెల్లూరు

02



## ఆప్కో చేనేత వస్త్రాల
# ఎగ్జిబిషన్‌ను సందర్శన

నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :

రాష్ట్రంలో చేనేత వస్త్రాలకు ప్రాచుర్యం కల్పించే దిశగా అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన 12 స్టాళ్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సందర్శించారు. గురువారం స్పీకర్ అయ్యన్నపాత్రులు, రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తదితరులు, ఇతర ఎమ్మెల్యేలతో కలిసి స్టాళ్లను సందర్శించిన ఆమె.. ఈ సందర్భంగా వస్త్రాలను పరిశీలించి సంతోషం

-మిగతా 2లో

## కలెక్టరేట్లో ఉద్యోగుల
# గ్రీవెన్స్ డే

వివరాలు 2లో



## రాపూరు, కలువాయి మండలాల్లో
# టూరిజం అభివృద్ధి చేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కురుగొండ్ల విజ్ఞప్తి

రాపూరు, మేజర్‌న్యూస్ :




వెంకటగిరి నియోజకవర్గంలోని వెనుకబడిన రాపూరు, కలువాయి మండలాలను పర్యాటక పరంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక, ప్రకృతి సంపదలతో ప్రసిద్ధిగాంచిన ఈ ప్రాంతాల్లో టూరిజంను ప్రోత్సహిస్తే యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. రాపూరు మండలంలోని పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పవిత్ర క్షేత్రంగా రాష్ట్రంలోనే పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమని పేర్కొన్నారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇక్కడికి వచ్చి పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకున్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రకృతి అందాలు, కొండల మధ్య ఆధ్యాత్మిక వాతావరణం కలిగిన ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు రాపూరు మండలంలో

మిగతా 2

## కంపసముద్రంలో
# గ్రంథాలయ ఏర్పాటుకు కృషి

### జిల్లా గ్రంథాలయ చైర్మన్ మేకపాటి శాంతకుమారి
### గ్రామాభివృద్ధికి చెక్కులు పంపిణీ



నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మేకపాటి శాంతి కుమారి మర్రిపాడులోని తమ స్వగ్రామం కంపసముద్రం గ్రామానికి విచ్చేశారు. గ్రామస్తులు, యువకులు బాణా సంచా, డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. జిల్లా స్థాయి పదవిని చేపట్టిన తర్వాత తొలి సారిగా స్వగ్రామానికి రావడంతో గ్రామమంతా సందడి నెలకొంది. తాను చదివిన పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమై మాట్లాడారు. స్కూల్ ఆవరణంలో గ్రంథాలయ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

04 పేజీలో



నేటి యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

## నెల్లూరు నగరంలో..
# అడుగడుగునా కషాయమయం

### ఆర్ఎస్ఎస్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్, శివాజీ సేన ఆధ్వర్యంలో ర్యాలీ, బహిరంగ సభ

నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నెల్లూరు వీఆర్సీ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. అనంతరం వీఆర్సీ గ్రౌండ్ నుండి బయలుదేరి పీఆర్సీ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, శివాజీ సెంటర్, బోసు బొమ్మ మీదుగా నర్తకి సెంటర్ తిరిగి గాంధీ బొమ్మ, వీఆర్సీ గ్రౌండ్ వరకు కాషాయమయంతో నిండిన

-మిగతా 2లో

- 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అభిమానులు
- గునుకుల కిషోర్‌కు శస్త్రచికిత్స విజయవంతం
- 30 రోజుల విశ్రాంతి సూచించిన వైద్యులు

గునుకుల కిషోర్ త్వరగా కోలుకోవాలని

# రుద్రాభిషేకాలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిశోర్ తీవ్ర అనారోగ్యంతో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. పరీక్షల అనంతరం శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. బుధవారం సుమారు 4 గంటలపాటు జరిగిన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయ్యింది. 30 రోజుల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఇటీవల ప్రజా కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొనడం వల్ల ఆరోగ్యంపై ప్రభావం పడిందని పార్టీ కార్యకర్తలు తెలిపారు. కిశోర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు ఆకాంక్షించారు. కిషోర్ సతీమణి, ఏఎంసీ డైరెక్టర్ గునుకుల విజయలక్ష్మి మాట్లాడుతూ.. శస్త్రచికిత్స విజయవంతమైందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అదేవిధంగా స్టాకెంజో కంపెనీ డైరెక్టర్ విష్ణు.. హరనాదపురంలోని శివాలయంలో మహాశివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయం బయట 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని, కిషోర్ త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రం లోకి రావాలని ప్రార్థించారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, నగర కార్యదర్శి హేమచంద్ర యాదవ్, నగర కార్యదర్శి కృష్ణవేణి, నగర సంయుక్త కార్యదర్శి పసుపులేటి శరవణ, 2, 26వ డివిజన్‌ల అధ్యక్షులు నాగేంద్ర బాలు, సుచిత్, నాయకులు అశోక్, హరి, వర్షన్, నరహరి, బాలాజీ, సాయి, షారు, స్టాకెంజో సభ్యులు పాల్గొన్నారు.

# ఎంపీ వేమిరెడ్డి పీఏ అని చెబుతున్న నకిలీ పీఏ అరెస్టు

**నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు - ప్రజలు ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి**




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పీఏ అంటూ బెదిరింపులకు దిగిన నకిలీ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు గురువారం నెల్లూరు 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. వివరాల మేరకు.. తిరుపతికి చెందిన నదీమ్ అనే వ్యక్తి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పీఏ అంటూ జమ్మలమడుగుకు చెందిన గొల్ల నరేష్ అనే వ్యక్తికి పలుమార్లు ఫోన్ చేసి డబ్బుల కోసం బెదిరించారు. దాంతో నరేష్ నెల్లూరు ఎంపీ కార్యాలయానికి సమాచారం అందించగా.. కార్యాలయ సిబ్బంది 4వ పట్టణ పోలీసులకు కంప్లైంట్ చేశారు. దాంతో విచారించిన పోలీసులు.. తిరుపతికి చెందిన నదీమ్‌ను గుర్తించి అరెస్టు చేశారు. ఎంపీ పీఏ అంటూ పలువురిని బెదిరించినట్లు గుర్తించారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. నిందితుడికి తప్పకుండా తగిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :**

ప్రజలు ఇలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తరఫున విజ్ఞప్తి చేస్తున్నాం. పీఏ అంటూ ఎవరైనా ఇలాంటి బెదిరింపు కార్యక్రమాలకు, అక్రమాలకు పాల్పడితే వెంటనే నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

## ఆప్కో చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ సందర్శన



*(మొదటి పేజీ తరువాయి)*

వ్యక్తం చేసి వస్త్రాలు కొనుగోలు చేశారు. చేనేత వస్త్రాలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాచుర్యం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడం ద్వారా, నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ప్రజలంతా వారంలో ఒక రోజు చేనేత దుస్తులు ధరించడం ద్వారా సంప్రదాయమైన చేనేత వృత్తికి వెన్నుదన్నుగా నిలిచేవారవుతారని చెప్పారు.

## నెల్లూరు నగరంలో.. అడుగడుగునా కాషాయమయం

*(మొదటి పేజీ తరువాయి)*




జన సమూహంతో మహారాజ్ ఛత్రపతి శివాజీ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నూజుల శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచార ప్రముఖ్ భయ్యా శ్రీనివాసులు, ఏబీవీపీ పూర్వ కార్యకర్త, విద్యార్థి ఉద్యమ నాయకుడు శేఖర్ జి, ఆంధ్రప్రదేశ్ ప్రాంతం ఎన్విసన్ ప్రాంత ప్రముఖ్ సుబ్బరామ్ రెడ్డి, నెల్లూరు జిల్లా ప్రముఖ్ గంగాధర్ పాల్గొన్నారు.





రాపూరు,కలువాయి మండలాల్లో

## టూరిజం అభివృద్ధి చేయాలి

*(మొదటి పేజీ తరువాయి)*

కండలేరు జలాశయంను నిర్మించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చెన్నై ప్రజల తాగునీటి అవసరాలతోపాటు నెల్లూరు, తిరుపతి జిల్లాల ప్రాంత రైతులకు సాగునీరు, త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు రూపుదిద్దు కుందని ఎమ్మెల్యే చెప్పారు. చెన్నైకు పైపులైన్ల ద్వారా నీరు తరలించే ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, స్థానిక రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని కాలువ నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారని ఎమ్మెల్యే వివరించారు. తెలుగుగంగ నీటితో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. గతంలో వర్షాధారంపై ఆదారపడి సజ్జ, రాగి, జొన్న వంటి వెల్ది పంటలు సాగు చేసిన రైతులు నేడు వరి పంటను రెండుకార్లు పండించగలుగుతున్నారంటే అది ఎన్టీఆర్ దూరదృష్టి ఫలితమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కండలేరు డ్యాం మట్టికట్టకు రివెట్‌మెంట్ నిర్మించకపోతే కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే కురుగొండ్ల ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కలువాయి మండలంలోని పెన్నబద్వేలు, పెన్నానది వద్దున ఉన్న పురాతన దేవాలయాలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల విజ్ఞప్తి కోరారు. అదేవిధంగా కండలేరు డ్యాం, కలువాయి మినీ రిజర్వాయర్ దగ్గర బోటింగ్ సదుపాయం, పార్కు ఏర్పాటు చేస్తే పర్యాటక అభివృద్ధికి దోహదపడు తుందని ఎమ్మెల్యే సూచించారు. రాపూరు, కలువాయి మండలాల్లో భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని ఆస్వాదించడం తోపాటు ప్రకృతి సోయగాలను వీక్షించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందు దుర్గేష్ కృషి చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతం పర్యాటక పరంగా అభివృద్ధి చెందితే ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే కురుగొండ్ల చెప్పారు.

## పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించండి

*(మొదటి పేజీ తరువాయి)*

నగర పాలక సంస్థకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను 247 కోట్లు, ఖాళీ స్థలం పన్ను 37 కోట్లు, తాగునీటి కుళాయి పన్ను 63 కోట్లుగా మొత్తం 347 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది మొండిబకాయలతో పాటు ప్రస్తుత డిమాండ్ మొత్తం 347 కోట్లకు గాను ప్రస్తుతానికి కేవలం 90 కోట్లు మాత్రమే వసూలు చేశామని, ఇంకా 257 కోట్లు మొండి బకాయిలుగా ఉన్నాయని తెలిపారు. బకాయిల చెల్లింపు అవగాహన కోసం వివిధ ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు ద్వారా, నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం సిబ్బంది ద్వారా నోటీసులను అందజేసి ఉన్నామని కమిషనర్ తెలిపారు. గతంలో జరిగిన నేషనల్ లోక్ అదాలత్ ద్వారా సుమారుగా వెయ్యి మందికి పైగా నోటీసులు అందజేసి వారి నుంచి 12 కోట్ల రూపాయలను వసూలు చేశామని కమిషనర్ తెలిపారు. బకాయిలు ఉన్న వారందరికీ నేషనల్ లోక్‌అదాలత్ ద్వారా నోటీసులు జారీ చేయనున్నామని, మొండి బకాయిదారులపై రెవెన్యూ రికవరీ ఆక్ట్ కూడా ప్రయోగించబోతామని కమిషనర్ స్పష్టం చేశారు. మార్చి 14వ తేదీన జరిగే నేషనల్ లోక్ అదాలత్‌కు హాజరై కేసులను మాఫీ చేసుకోవాలని సూచించారు. నగరవ్యాప్తంగా జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన మూలధనం కేవలం పన్నుల వసూళ్ల ద్వారా మాత్రమే ఖర్చు చేయగలమని, బాధ్యతగా భావించి బకాయిదారులందరూ నిర్దేశించిన సమయంలో పన్నులను చెల్లించాలని కమిషనర్ సూచించారు.

## కలెక్టరేట్లో ఉద్యోగుల గ్రీవెన్స్ డే



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** ఉద్యోగుల గ్రీవెన్స్ డేను జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డేలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులు వారి వారి సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ కుమార్ ప్రతి ఉద్యోగునితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సంబంధిత దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు అందజేసి నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలి

## యుపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అన్విత



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఆదేశానుసారం గురువారం దర్గామిట్ట నందుగల శిశుగృహ, బాలసదన్ బాలికల హాస్టల్ నందు శిశువులకు, బాలికలకు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, చంద్రమౌళి నగర్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్విత మాట్లాడుతూ.. వసతి గృహంలో ఉన్న బాలికలు వారి ఆరోగ్యంపట్ల అవగాహన కలిగిఉండాలని, సీజనల్‌గా వస్తున్న వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరం, వాంతి, విరోచనాలు తదితర వ్యాధులపట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రతిరోజు చదువుతోపాటు కొద్దిసేపు ధ్యానం, వ్యాయామం కూడా చేస్తే మంచిదని, మీకు ఇస్తున్నటువంటి పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకుంటూ ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఈ శిబిరం నందు బాలికలకు మందులు ఇవ్వడం జరిగింది . అనంతరం పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ శిబిరంను జిల్లా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హీనా సుజన ప్రారంభించి మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతిరోజు తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు, తెలియజేశారు. ఈ శిబిరం నందు యూపీహెచ్‌ఎస్సి ఎన్బిటి కాలనీ వైద్యాధికారిణి డాక్టర్ పి.రీనా భారతి, శిశు గృహ సూపరింటెండెంట్ లక్ష్మి, బాలసదన్ మేనేజర్ దుర్గాదేవి, సూపర్వైజర్ రమణి, కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, జిల్లా పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, ఏఎన్ఎం హైమావతి, ఆశ వర్కర్ ప్రసన్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు




- శివాజీ మహారాజ్ 20అడుగుల భారీ కటౌట్‌కు పాలాభిషేకం
- చత్రపతి సేవలను కొనియాడిన వక్తలు, యువత, మహిళలు
- నెల్లూరు, దర్గామిట్టలోని ప్రగతి నగర్‌లో వేడుకలు నిర్వహణ

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** తల్లి మాటలకు కట్టుబడి హిందూ ధర్మ రక్షణకు చత్రపతి శివాజీ మహారాజ్ చేసిన సేవలు చరిత్రలో చిరస్మరణీయమని శివాజీ సేన అధ్యక్షులు కాకు మురళిరెడ్డి, పవర్ యూత్ అధ్యక్షులు రమేష్ రాజు కొనియాడారు. నెల్లూరు దర్గామిట్టలోని ప్రగతి నగర్ మెయిన్ రోడ్‌లో పవర్ యూత్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చత్రపతి శివాజీ మహారాజ్ 20 అడుగుల కట్‌ఔట్‌కు పాలాభిషేకం, పుష్పాంజలి ఘనంగా చేపట్టారు. అనంతరం బాణాసంచా కాల్చి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకు మురళి రెడ్డి, రమేష్ రాజ్ మాట్లాడుతూ.. తల్లి మాట కోసం హిందూ ధర్మ రక్షణకు శివాజీ మహారాజ్ చేసిన సేవలు చరిత్రపుటల్లో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గవన్నారు. హిందూ ఆలయాల సంరక్షణ, మహిళల సంరక్షణ, గోమాతల సంరక్షణ, తదితర ఎన్నో ధార్మిక కార్యక్రమాలను నిర్వహించి భారతదేశ ఖ్యాతిని నిలిపారని తెలిపారు. అలాంటి మహోన్నత వ్యక్తిని స్మరించుకుంటూ నెల్లూరులో గత ఆరు సంవత్సరాలుగా శివాజీ సేన ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19వ తేదీన అంగరంగ వైభవంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈరోజు సాయంత్రం నాలుగు గంటలకు నెల్లూరు విఆర్సి సెంటర్ నుంచి శివాజీ సేన ఆధ్వర్యంలో ర్యాలీ ఉంటుందని, హిందూ ధర్మ రక్షకులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివాజీ సేన అధ్యక్షులు కాకుమురళీ రెడ్డి, ఆర్ఎస్ఎస్ నగర సహకార్యవహ సతీష్, ఇతర పార్టీ నాయకులు, పరిసర ప్రాంత ప్రజలు, పవర్‌యూత్ రమేష్‌రాజు, వెంకటసూర్య, సురేష్ రాజు, బాలాజీ, ప్రకాష్, సతీష్, సాయి, తేజ, సెల్వాకుమార్‌హరీ బాబు, చింటు, బాబు యాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ : ఎంఈఓ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం మార్కండేయ పురం పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి బి.గోవిందయ్య అకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం వారు పలు రికార్డులను అసెస్మెంట్స్, బుక్స్ హోలీ స్టిక్, ప్రోగ్రెస్ కార్డులు జిఎఫ్ఎల్ఎన్ తదితరాలను పరిశీలించి అక్కడ సమస్యలను విద్యార్థులకు ఏ విధంగా ఉపాధ్యాయులు బోధిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. బాలబాలికల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులకు విలువైన సలహాలు తగు సూచనలు చేశారు. నిరుపేద విద్యార్థుల ప్రయోజనార్థం పాఠశాలకు ప్రహరీని శిథిలావస్థలో ఉన్న పాత భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు ఉన్నత అధికారులకు సిఫారసు చేయాలని ఆ సమయంలో అక్కడ ఉన్న పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.స్వాతి శ్రీనివాసులు మండల విద్యాశాఖ అధికారి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ఎంఈఓ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల సమస్యలను పరిష్కరిస్తూ ఉన్నత సేవలు అందిస్తున్న విద్యాశాఖ అధికారి గోవిందయ్యను ప్రధాన ఉపాధ్యాయులు చెన్న కృష్ణయ్య ఉపాధ్యాయులు టి.రామకృష్ణారెడ్డి విద్యార్థిని, విద్యార్థులతో కలిసి ఘనంగా సత్కరించారు. అలాగే కరివేటి వారి పాలెం ప్రాథమిక పాఠశాలలో కూడా తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంట సిఆర్ ఎం.రమణయ్య సిబ్బంది ఉన్నారు.

## బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ గాయత్రి కళ్యాణమస్తు బ్రాహ్మణ ఉచిత వివాహ సమాచార కేంద్రం ఆధ్వర్యంలో మే 31వ తేదీ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు నిర్వా హకులు ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ కొండాయపాలెం గేటు శ్రీ రాధాకృష్ణ యోగ మందిరం గణపతి సచ్చిదానంద ఆశ్రమ లక్ష్మీ దేవాలయంలో మే 31వ తేదీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. 21 సంవత్సరాలు పూర్తయిన వధూ వరులు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమకు నచ్చిన సంబం ధాన్ని ఖాయపరచుకోవచ్చని తెలియజేశారు. ఈ పరిచయ వేదికలో పాల్గొనేవారు 9848486599, 6301868900లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇసుకపల్లి యశ్వంత్ కుమార్, సి.సత్యనారాయణ, ఐ.జయలక్ష్మి, ఎస్.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** మండల తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ ఓటమి నాయకుల ఆధ్వర్యంలో గురువారం చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి, పుష్పాంజలి చేపట్టారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మారంరెడ్డి పల్లి సహకార సంఘం అధ్యక్షులు సోమనబోయిన రాజశేఖర్, మండల తెలుగుదేశం పార్టీ యువత అధ్యక్షులు సొల్లేటి వికాస్‌బాబు మాట్లాడుతూ.. తల్లి మాట కోసం హిందూ ధర్మ రక్షణకు శివాజీ మహారాజ్ చేసిన సేవలు చరిత్రపుటల్లో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గవన్నారు. హిందూ ఆలయాల సంరక్షణ, మహిళల సంరక్షణ, గోమాతల సంరక్షణ, తదితర ఎన్నో ధార్మిక కార్యక్రమాలను నిర్వహించి భారతదేశ ఖ్యాతిని నిలిపారని తెలిపారు. మహారాష్ట్రలో ఆయనను దేవునిగా పూజిస్తారని తెలిపారు. కష్టం వచ్చినా ప్రతి భారతీయుడికి మనోధైర్యాన్ని నింపే ఒకే ఒక్క వ్యక్తి ఎవరంటే అది శివాజీ మహారాజ్ అని తెలిపారు. మహిళలకు సైతం శివాజీ అనే మూడు అక్షరాలు ధైర్యంను నూరుపోస్తాయని తెలిపారు. మండల నాయకులతో చర్చించి మండల ఆఫీస్ ప్రాంగణంలో శివాజీ మహారాజ్ విగ్రహ స్థాపనకు కృషి చేస్తామని తెలిపారు.

## రక్షణ కల్పించాలని తహసిల్దార్‌కు విజ్ఞప్తి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** తిమ్మసముద్రం గ్రామానికి చెందిన కాసు మహేశ్వరరావు అమావాస్య మహేశ్వరరావులకు చెందిన ప్రభుత్వ భూమిని ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని జలదంకి తహసిల్దార్‌కు వారు విజ్ఞప్తి చేశారు. గురువారం తాసిల్దార్ కార్యాలయంకి గ్రామ నాయకులు కంచర్ల వినోద్ నాయుడుతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ పొలం వివాదంపై మూడు రోజుల క్రితం కూడా ఘర్షణ జరిగిందని, తీవ్ర గాయాల పాలైతే కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందారన్నారు. తాసిల్దార్ తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని నాయకులు వినోద్ నాయుడు పేర్కొన్నారు. నిందితులు పొలాల ఆక్రమించి, ప్రభుత్వ అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ భూములను సాగు చేయకుండా బోర్డులు వేసి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వినోద్ నాయుడు డిమాండ్ చేశారు. వారి వెంట గ్రామ కమిటీ అధ్యక్షులు మేకల శ్రీనివాసులు ఉన్నారు.

## రామాలయం అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళం



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోనీ తూర్పు మాలపాలెం రామాలయ అభివృద్ధికి ఏజీఎన్ కన్స్ట్రక్షన్ అధినేతలు గడ్డం పకీరయ్య, రంజాన్ కుటుంబ సభ్యులతో కలిసి లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ నిర్వహణ కమిటీకి చెక్కు రూపంలో అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈ విరాళం ఆలయ అభివృద్ధి పనులు, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విరాళం అందజేసిన దాతకు ఆయా గ్రామ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ ప్రజలు ఏజీఎన్ కన్స్ట్రక్షన్స్ వారిని ప్రశంసిస్తూ, మరింత మంది దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఏజిఎన్ కన్స్ట్రక్షన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కంపసముద్రంలో గ్రంథాలయ ఏర్పాటుకు కృషి

● జిల్లా గ్రంథాలయ చైర్మన్ మేకపాటి శాంతకుమారి ● గ్రామాభివృద్ధికి చెక్కులు పంపిణీ ● స్వగ్రామంలో ఘన స్వాగతం





**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మేకపాటి శాంతి కుమారి మర్రిపాడు మండలంలోని తమ స్వగ్రామం కంపసముద్రం గ్రామానికి విచ్చేయడంతో గ్రామస్తులు, యువకులు బాణాసంచా, డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. జిల్లా స్థాయి పదవిని చేపట్టిన తర్వాత తొలిసారిగా స్వగ్రామానికి రాగా గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది. తాను చదివిన పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమై మాట్లాడారు. స్కూల్ ఆవరణంలో గ్రంథాలయ ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ర్యాలీగా బయలుదేరి గ్రామంలోని రాములవారి స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ.. తమ గ్రామం నుంచి జిల్లా స్థాయిలో గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. మేకపాటి శాంతకుమారికి అభినందనలు తెలియజేస్తూ మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కంపసముద్రం గ్రామం తనకు ఎంతో ప్రత్యేకమని, ఈ గ్రామంలోనే తాను అక్షరాభ్యాసం చేశానని గుర్తుచేశారు. గ్రామ ప్రజలు ఎంతో సున్నితమైన మనసు కలవారని, మేకపాటి శాంతి కుమారికి ఎల్లప్పుడూ అండగా నిలవాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మేకపాటి శాంతి కుమారి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు, అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు నమస్కారాలు తెలుపుతూ 'నేను ఎంత ఎదిగినా నా సొంత ఊరిలో మీ మనిషిగానే ఉంటాను' అన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. గతంలో ముస్లిం సోదరులు, యాదవ సోదరులకు సహాయం చేస్తానని ఇచ్చిన హామీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడిందని, అందుకు గ్రామస్తులు క్షమించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం రంజాన్ పర్వదినాన గ్రామ మసీదు మరమ్మతులకు రూ.2లక్షల చెక్కును ముస్లిం సోదరులకు అందజేశారు. అలాగే యాదవ సామాజిక వర్గానికి రూ.2లక్షల చెక్కును గ్రామస్తుల సమక్షంలో అందించారు. తన ఎదుగుదలను ఓర్వలేక కొందరు రాజకీయాలు చేస్తున్నారని, ఎవరు ఎన్ని రాజకీయాలు చేసినా భయపడేది లేదని స్పష్టం చేశారు.

# వైభవంగా వెంకటేశ్వరుని కళ్యాణ మహోత్సవం

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని రామకృష్ణా నగర్‌లో ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడవ రోజు అయిన గురువారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, పురోహితుల వేదమం త్రోచ్ఛాలనడుమ కళ్యాణ కార్యక్రమం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు వెంకటేశ్వర స్వామి చరిత్రను, దాని విశిష్టతను గూర్చి భక్తులకు వివరించారు. వేసవి తాపం అధికంగా ఉండడంతో ఆలయ పాలక మండలి భక్తులకు త్రాగునీరు, వైద్య సౌకర్యం ఏర్పాటు చేశారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సీఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో ఆలయ ప్రాంగణాన్ని పర్యవేక్షించారు.

**నేడు రథోత్సవం :** శుక్రవారం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని, పండరి భజనలు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు నడుమ రథోత్సవం సాగుతుందని, పాలకమండలి వారు తెలిపారు. రథోత్సవం కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొని వారు కోరారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్న వితరణ కార్యక్రమంలో కీర్తిశేషులు రామిశెట్టి భాస్కరరావు జ్ఞాపకార్థం కుమారుడు కళ్యాణ్ కుమార్, కోడలు ఝాన్సీలు, అలాగే కొంజేటి వెంకట శేషయ్య, రాజ్యలక్ష్మి, రమణమ్మతోపాటు కుమారులు మురళి, మోహన్



బాబు, కళ్యాణ్ కుమార్ మనుమలు, మనుమరాండ్రు పాల్గొన్నారు.

# పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధి సహకరించండి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో చెల్లించాల్సిన పన్నులను చెల్లించి ఆ పంచాయతీల అభివృద్ధి సహకరించాలని కావలి డీఎల్‌పీఓ పివి రమణ తెలిపారు. గురువారం వింజమూరు పంచాయతీ కార్యాలయంలో పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వింజమూరు మండలం మొత్తం పన్నుల డిమాండ్ ఒక కోటి 78 లక్షలు గా ఉందన్నారు. వసూళ్లు కేవలం 35 లక్షల మాత్రమే వచ్చాయని ఇక రావలసినది సుమారుగా కోటి 15 లక్షలు ఉందన్నారు. అలాగే వింజమూరు పంచాయతీలో రావలసిన పనులు ఒక కోటి 51,61 వసూలు చేసినవి 54 లక్షలని రావలసినవి 98 లక్షల మంది ఉన్నారు. ఈ పనులు వసూలుకు ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేసి పన్ను వసూలు వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ డ్రైవ్ సందర్భంగా రోజుకు మూడు లక్షల వరకు వసూలు చేయాల్సిన లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. పంచాయతీకు పన్నులు వసూలు కానీ అట్లయితే అభివృద్ధి కుంటుపడుతుందని అందుచేత ప్రజల విషయాన్ని తెలుసుకొని సకాలంలో పనులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం పంచాయతీ పనులు కార్యాలయానికి రాకుండానే క్యూఆర్ కోడ్ ద్వారా సెల్ఫోన్ ద్వారా చెల్లించుకోవచ్చని ఆయన తెలిపారు. అలాగే ఏ కిస్తిపురం బుక్కాపురం చాకలికొండ గుండిమడగల జనార్ధన పురం కాటేపల్లి నల్లగొండ నందిగుంట రావిపాడు శంకవరం ఊటుకూరు పంచాయతీలలో రావలసిన పనులను సకాలంలో వసూలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ కే.రామారావు డీఎల్‌పీఓ కార్యాలయం సిబ్బంది శ్రీనివాసులు వేణు పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మెడికవర్ హాస్పిటల్‌లో అరుదైన 'ఎండోవ్యాక్' చికిత్స



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అరుదైన 'ఎండోవ్యాక్' చికిత్స ద్వారా 65 ఏళ్ల వృద్ధురాలికి పునర్జన్మ ప్రసాదించారు. కావలికి చెందిన కోటమ్మ తింటుండగా ఎముక గొంతులో ఇరుక్కుపోయి, అన్నవాహికకు చిల్లు పడటంతో తీవ్ర ఇన్ఫెక్షన్‌కు గురయ్యారు. శ్వాస తీసుకోవడం కూడా కష్టమైన స్థితిలో ఆమెను మెడికవర్ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ వరుణ్ ప్రకాష్, డాక్టర్ రంగనాథ్‌లతో కూడిన నిపుణుల బృందం ఆమె పరిస్థితిని అంచనా వేసింది. సాధారణంగా ఓపెన్ సర్జరీ అవసరమయ్యే ఈ కేసులో, రోగి వయస్సును పరిగణనలోకి తీసుకుని అత్యాధునిక ఎండోస్కోపిక్ పద్ధతి, ఎండోవ్యాక్ థెరపీ ద్వారా ఎటువంటి పెద్ద శస్త్రచికిత్స లేకుండా అన్నవాహికలోని చిల్లును విజయవంతంగా మూసివేశారు. సమయస్ఫూర్తితో వైద్యులు అందించిన ఈ అంతర్జాతీయ స్థాయి చికిత్సతో కోటమ్మ పూర్తి కోలుకుని ప్రస్తుతం సాధారణ ఆహారం తీసుకుంటున్నారు అని వైద్యులు తెలిపారు.

## పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా నగరవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. డ్రైన్ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, విద్యుత్ వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ తదితర మౌలిక వసతులను అధికారులతో కలిసి పరిశీలించి వివిధ సూచనలు జారీ చేశారు. స్థానిక బాలాజీ నగర్ అన్నపూర్ణ అపార్ట్మెంట్స్ ప్రాంతంలో పన్నులు బకాయిలో ఉన్న వారితో మాట్లాడారు. నిర్దేశించిన సమయంలోపు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పనులు మొత్తాలను తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు. నూతనంగా ఎండ్ టు ఎండ్ నిర్మిస్తున్న సి.సి రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ తనిఖీ చేశారు. ఉమా మహేశ్వరి ఆలయం ప్రాంతంలో డ్రైన్ కాలువలను తనిఖీ చేసి అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. రామయ్య బడి ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. బట్వాడీ పాలెం కూడలిలో నిర్మాణం జరుగుతున్న ఫౌంటెన్ పనులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయంలో బహిరంగ వేలంపాట



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలో వేంచేసియున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు 2026-27 సంవత్సరంకు బహిరంగ వేలంపాట, సీల్డ్ టెండర్లు గురువారం ఉదయం 11 గంటలకు జరిగాయి. బహిరంగ వేలంపాటల ద్వారా రూ.3,11,500 హెచ్చు పెరిగింది. వేలంపాటలకు పర్యవేక్షణాధికారిగా ఇందుకూరుపేట గ్రూప్ దేవస్థానముల కార్యనిర్వహణాధికారి యం.మోహన్ కుమార్, ట్రస్టుబోర్డు ఛైర్మన్ సురేంద్రయాదవ్, సభ్యులు, దేవస్థాన కార్య నిర్వహణాధికారి వి.గిరికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సాగరమాల రోడ్డుపై సమాధానం చెప్పేవారు ఎవరు?

## ఐదు నెలలుగా పరిహారం ఇవ్వరా !



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మిస్తున్న సాగర మాల ప్రాజెక్టు రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం చెల్లించే ప్రక్రియలో సమాధానం చెప్పే వారెవరో అంటూ ఈపూరు బిట్ -1బి బాధిత రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం 6 మంది రైతులు తహసిల్దార్ స్వప్నను రెవెన్యూ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రైతుల తరపున అధికార పార్టీ నాయకులు, తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడు తిన్నెలపూడి సిద్దు నేతృత్వం వహించినారు. ఈ సందర్భంగా రైతుల పక్షాన ఆయన తహసిల్దార్‌తో మాట్లాడారు. రెండో విడత అవార్డు విచారణలో అవసరమైన భూమిని సేకరించి రెండు ఎకరాలు రైతుల నుంచి స్వాధీనం చేసుకున్నారని 60 లక్షలకు పైగా నష్టపరిహారాన్ని ఆరు మంది రైతులకు ఇవ్వాల్సి ఉండగా ఐదు నెలలుగా చెల్లింపులు జరగలేదని తహసిల్దార్‌కు ఆయన తెలియజేశారు. బ్యాంక్ ఖాతాల్లో సాంకేతిక సమస్యలు ఉన్నాయని తహసిల్దార్ సమాధానం చెప్పారు. ఎన్‌హెచ్‌ఎఐ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో ఈ విషయం పైన మాట్లాడి రైతులకు న్యాయం జరిగే విధంగా సమస్య త్వరగా పరిష్కారం చూపిస్తామని తహసిల్దార్ హామీ ఇచ్చారు. అనంతరం రైతులు కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతారా అంటూ రైతు నాయకులు తిన్నెల పూడి ప్రాజెక్టు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్ట పరిహారంతో పాటు ఐదు నెలలకు వడ్డీ కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గడువులోగా సమస్య పరిష్కారం కాకపోతే శాంతియుతంగా పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని రైతులు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను హెచ్చరించారు. ఈ విషయంపై పోలీస్ శాఖకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కంటి చూపు రోగులకు వీపీఆర్ నేత్ర సంజీవనీ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలంలోని కంటి చూపు రోగులకు వీపీఆర్ నేత్ర సంజీవనిలా పనిచేస్తుందని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి తెలిపారు గురువారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో విపిఆర్ నేత్ర ఉచిత వైద్య కంటి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లేక కంటి సమస్యలతో బాధపడేవారు. ఈ ఉచిత వైద్య శిబిరం ఎంతో ఊరటనిస్తుందన్నారు. వీపీఆర్ దంపతులు పేద ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలను ఉచితంగా అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపడం విపిఆర్ ఫౌండేషన్ ద్వారా నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కంటి సమస్యలతో బాధపడేవారు నేత్ర శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారికి కళ్లద్దాలను వెంటనే అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం అధునాతనమైన మొబైల్ ఐ క్లినిక్ ద్వారా పరీక్షించి ఉచితంగా అద్దాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సర్పంచి ముప్పూరి విజయలక్ష్మి ఎంపీటీసీ సభ్యులు పల్లా పురుషోత్తం మాజీ సర్పంచ్ మండాది చిన రాఘవరెడ్డి మాజీ ఎంపీటీసీ మండాది పెద రాఘవరెడ్డి తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మండాది గంగిరెడ్డి నాయకులు గుండు బోయిన మాధవ డబ్బు కొట్టి హరిబాబు ఒల్లెబోయిన రమేష్ ఆనాటి వీరయ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఘనంగా వెంకటరావుపల్లి పాఠశాల వార్షికోత్సవం

## ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దడంమే లక్ష్యం : మన్నేటి




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని కొండాయపాలెం పంచాయతీ వెంకట్రావుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి మన ఫౌండేషన్ వ్యవస్థాపకులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధిలో భాగంగా తన ఫౌండేషన్ నుంచి ఉన్నత పాఠశాలకు సౌకర్యాలు కల్పిస్తున్నారని విద్యార్థుల సౌకర్యార్థం నెలకు 44 వేల రూపాయలు ఖర్చుతో ఆటోలు నడుపుతున్నట్లు భవిష్యత్తులో ఒక స్కూల్ వ్యాన్ తీసుకునేందుకు ఆలోచన చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పాఠశాల నుంచి పదవ తరగతి ఫలితాల్లో మండల ఫస్ట్ సాధించిన విద్యార్థికి అతను చదువుకున్నంత వరకు చదువుకున్నంత కాలం ఏది చదివితే అది చదివించేందుకు తన ట్రస్టు ద్వారా ఖర్చులు భరిస్తానని ప్రకటించారు. రాబోయే రోజుల్లో జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఎంఎల్ఏ, ఎంపి, ఎంఎల్‌సిల సహకారంతో ఒక ఆదర్శవంతమైన ఉన్నత పాఠశాలగా వెంకటరావుపల్లి ఉన్నత పాఠశాల ను తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువ గలం సైకిళ్ల రాష్ట్రంలో విద్యార్థులకు పంపిణీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని అయితే నెల్లూరు జిల్లాను మోడల్‌గా తీసుకొని ముందు నెల్లూరు జిల్లా నుంచి సైకిళ్ల పంపిణీ ప్రారంభిస్తానని మాట ఇచ్చారని అందులోనూ వెంకటరావుపల్లి ఉన్నత పాఠశాల నుంచి కార్యక్రమం ప్రారంభిస్తామని చెప్పటం శుభ పరిణామమని తొందరలోనే వెంకటరావుపల్లి వేదికగా యువగళం సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టబోతున్నామని ఆయన ప్రకటించారు. అనంతరం వెంకటరావుపల్లి పాఠశాలలోని ఉపాధ్యాయులతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న అనుబంధ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆయన ఘనంగా సన్మానించారు. పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులకు భోజనం ఏర్పాట్ల సైతం చేశారు. స్వయంగా విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు విద్యా కమిటీ చైర్మన్ రసూల్, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరెడ్డి, జల్సా యాదవ్, గంగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులు స్టడీ అవర్స్ చదివేందుకు అవసరమైన పోషణను అందించాలని ఉద్దేశంతో ఆయన ఈ చిరు కార్యాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షల వేళ ఒత్తిడికి గురికాకుండా తగినంత శక్తి కలిగి ఉండాలని ఉద్దేశంతో స్నాక్స్ బిస్కెట్స్ అందిస్తున్నారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు వారికి ఈ విధంగా అందజేస్తానని తెలియజేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని చక్కగా ఇష్టంగా చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆశించారు. ఈనెల రోజులైనా కష్టపడి చదివినట్లయితే మంచి విజయాన్ని సాధించినట్లయితే పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు రావడమే కాకుండా సమాజంలో గుర్తింపును కలిగి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి ఉపాధ్యాయినీ బృందం విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు.

## పొదుపు మహిళలకు ప్రజారోగ్యంపై అవగాహన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి స్త్రీ శక్తి భవనంలో గురువారం పొదుపు మహిళలకు ప్రజారోగ్యంపై అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం కే.షారా స్రవంతి మాట్లాడు తూ.. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆహారం, పోషణ, ఆరోగ్యం, నీరు, పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండి గ్రామాల్లో ప్రజల్లో చైతన్యవంతం తీసుకురావాల న్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, అకౌంటెంట్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవన నిర్మాణాలకు పనులు ప్రారంభం



**ఉదయగిరి, మేజర్ న్యూస్ :** ఉదయగిరి విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణంలో నూతన భవనాల నిర్మాణాల కొరకు జంగిల్ క్లియరెన్స్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ముందుగా ఆ శాఖ ఏఈ చెంగయ్య, బద్వేలకు చెందిన ఎంఆర్ఎస్ఆర్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గుత్తేదారుడు ఎం.రామసుబ్బారెడ్డిలు టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.1.40కోట్లకు సంబంధించిన నూతన భవనాల నిర్మాణాల కొరకు ముందుగా జంగిల్ క్లియరెన్స్ చేసి భూమిపూజ నిర్వహించామన్నారు. నిర్దేశించిన గడువులోగా గుత్తేదారుడు భవన నిర్మాణాల పనులును పూర్తి చేయాలని కోరారు.

## రాపూరులో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**రాపూరు, మేజర్‌న్యూస్ :** చత్రపతి శివాజీ మహారాజ్ 196వ జయంతి వేడుకలు స్థానిక గ్రంథాలయంలో లైబ్రరియన్ ఏ.అంజయ్యా సమక్షంలో హిందూ జాగృతి సేవాసంస్థ వారి ఆద్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఏ.అంజయ్య మాట్లాడుతూ.. 1830 సంవత్సరంలో చత్రపతి శివాజీ మహారాజ్ జన్మించారన్నారు. చత్రపతి మహారాజ్ సేవలను చేసిన పోరాటాలను, ప్రదర్శించిన ధైర్య సాహసాలను ఆదర్శభావాలను ఆయన క్షుణ్ణంగా వివరించారు. ముందుగా చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. హిందు జాగృతి సేవా సమితి బాధ్యులు యస్ఆర్ పంతులు మాట్లాడుతూ.. భారత దేశ సామరస్యత, సమర్ధతను ప్రపంచ రాజ్యాలకు తెలిపిన మహోన్నత వ్యక్తి శివాజీ మహరాజ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ పాఠకులు, శివాజీ అభిమానులు పాల్గొన్నారు.

# మన్ కీ బాత్ గోడ పత్రిక ఆవిష్కరణ

- రేపటి దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మన్ కీ బాత్
- బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఎస్సీ మోర్చా నెల్లూరు జిల్లా అధ్యక్షులు డిఎస్ పరశురాం అధ్యక్షతన జిల్లా ఎస్సీ మోర్చా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు శిపారెడ్డి వంశీధర్ రెడ్డి, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పోలిచర్ల ఉదయ్ కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంటేటి బ్రహ్మయ్య పాల్గొన్నారు. అనంతరం మన్ కీ బాత్ గోడ పత్రికను ఆవిష్కరించారు ఈ సందర్భంగా బీజేపీ అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత మన్ కి బాత్ కార్యక్రమం తప్పకుండా నిర్విరామంగా జరుగుతోందని దాంట్లో భాగంగానే రేపటి దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలే కాకుండా క్రింది స్థాయి ప్రజలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, హాస్టల్ విద్యార్థులకు సైతం దేశం పట్ల అవగాహన బాధ్యత కలిగే విధంగా కార్యక్రమాలను ముఖ్యంగా ఎస్సీ మోర్చాఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రధానమంత్రి మనసులో మాట కార్యక్రమాన్ని వీక్షించే విధంగా చేసి అనంతరం కార్యక్రమం పై క్విజ్ కాంపిటేషన్ కార్యక్రమాన్ని నిర్వర్తించి బహుమతులు, సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సగిలి గురవయ్య, ఏవి రమణయ్య రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకన్న పరిరక్షణ కమిటీ



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ముద్దుమూడి గ్రామ మాత పరమేశ్వరి దేవాలయాన్ని శ్రీ పరమేశ్వరి అమ్మవారి దేవాలయ పరిరక్షణ కమిటీ సభ్యులు గురువారం దర్శించుకున్నారు. ముఖ్యఅతిథిగా కాకుటూరు రవీంద్ర రెడ్డి, బీజెపి సర్వేపల్లి అసెంబ్లీ కన్వీనర్, ఆరని వేణు గోపాల్ రెడ్డి, బిజెపి పార్టీ సినీయర్ నాయకులు వంగిపూడి రాధా కృష్ణయ్య, సంస్థ రాష్ట్ర సెక్రటరీ గూడూరు వెంకటేశ్వర్లు, సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లిబోయన రాజశేఖర్, బిజెపి పార్టీ నాయకులు మనుబోలు మండలం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భగా ముద్దుమడి గ్రామంలో ఉన్న శ్రీ మాత పరమేశ్వరి అమ్మవారి దేవాలయంకు ధూప దీప నైవేద్య పదకం మంజూరు చేసిన సందర్భంగా గత రెండు సంవత్సరాలుగా పూజారి బ్యాంక్ ఖాతాలో ముందు 5వేల రూపాయలు జమ కాగా గత సంవత్సరం నుంచి 10వేల రూపాయలు ప్రభుత్వం నుంచి జమ అవుతుంది. ఈ పథకం శ్రీ పరమేశ్వరి అమ్మవారి దేవాలయాల పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో మంజూరు చేయటం జరిగింది. ఈ సందర్భంగా కాకుటురు రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ.. హిందువులు అంతా ఐక్యంగా ఉండాలని దేవాలయం కేంద్రగా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకొని వస్తే పరిష్కారం చూపతమని, ప్రభుత్వం ఇంకా మిగిలిన హిందూ ఎస్సీ ఎస్టీల దేవాలయాలకు కూడా ధూప దీప నైవేద్య పథకం మంజూరు చేయించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ సేవకుల పై కమ్యూనిస్టుల దాడి అమానుషం

### పొదలకూరులో బీజేపీ నేత మిడతల రమేష్

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర యూనివర్సిటీలో మంగళవారం ఆర్ఎస్ఎస్ శాఖ జరుగుతుండగా వామపక్షవాదులు స్వయం సేవకుల మీద దాడి చేయడం అమానుషమని దాడిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత మిడతల రమేష్ అన్నారు. పొదలకూరులో గురు వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భరతమాతను కీర్తిస్తూ ప్రార్థన చేస్తున్న సమయంలో ఆ ప్రార్థన ను వినడానికి ఇష్టపడని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ముసుగులో వామపక్షాల గుండాలు దాడి చేయడం బాధాకరమ న్నారు. స్వయం సేవకుల మీద పడిన ప్రతి దెబ్బ భరతమాత మీద పడిన ట్లేనని తెలిపారు. సెక్యులరిజం ముసుగు ధరించుకొని భారతదేశ జీవన విధానానికి సంబంధంలేని విదేశీ సిద్ధాంతాలతో వామపక్షాలు కొనసాగుతు న్నాయని అన్నారు. భరతమాతను కీర్తిస్తున్న వారిపై దాడి చేయడం అంటే



భారతీయుల ఆత్మ మీద దాడి చేసినట్లుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు చింత గింజల సుబ్రమణ్యం, రాచపూడి ధనుంజయరావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సింగర్ రామచంద్రయ్యకు ఘన సత్కారం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో పాతపాటలతో ముఖ్యంగా భక్తి గీతాలతో అందర్నీ అలరించే కావలి ఘంటసాల బిరుదాంకితుడు రామచంద్రయ్యను శివరాత్రి ఉత్సవాలలో వారిని ఘనంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ నున్న మురళి, ఎస్.జయప్రతాప్ రెడ్డి తను భక్తి గీతాలలో అందర్నీ ఆకట్టుకొని మధురానుభూతిని అందించినందుకు ఘనంగా శా లవుతో సత్కరించారు. కావలి శివాలయంలో శివరాత్రి ఉత్సవాలలో తను భక్తి పాటలతో మనుషుల మనస్సును ఆకట్టుకున్నారు. ఆలయ అర్చకులు శశి గురుకుల్ ఉత్సవాలలో భాగంగా పాటకచేరి ఏర్పాటు చేయడం స్థానికులు ఆయన సీనియర్ నాయకులు రామచంద్రారావుకి అవకాశం ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. రామచంద్రరావు లాంటి వారికి దేవాలయాల్లో అవకాశం కల్పించి ప్రోత్సాహం ఇవ్వాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సామాజిక కార్యకర్త శారదమ్మ, కొండ బిట్రగుంట ఆలయ పాలకమండలి సభ్యులు బాబురావు, రంగా విగ్రహం వ్యవస్థాపకులు దేవరకొండ శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాపూరుకు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



**రాపూరు, మేజర్‌న్యూస్ :** ఈనెల 23వ తేదీ నుంచి జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధిం చిన ప్రశ్నాపత్రాలు గురువారం రాపూరు పోలీస్ స్టేషన్‌కు చేరాయని సీవీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి అన్నీ పరీక్ష కేంద్రా లకు పంపడం జరిగింది. ఇందులో భాగంగా పోలీసుల రక్షణలో అధికా రుల పర్యవేక్షణలో రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబం ధించిన ప్రశ్నపత్రాలు చేరడం జరిగిందని, ప్రశ్న పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించడం జరిగిందని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ఈనెల 23వ తేదీ నుండి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి కస్టోడియన్ అండ్ చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రిన్సిపల్ బి.కృష్ణవేణి, డిపార్ట్మెంటల్ అధికారిగా చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ ఎల్లయ్యను నిర్మించడం జరిగిందని ప్రిన్సిపల్ బి.కృష్ణవేణి తెలిపారు. రాపూరు పరీక్ష కేంద్రంలో రాపూరులోని ప్రైవేట్ జూనియర్ కళాశాల, ఏపీఎస్ డబ్ల్యూ జూనియర్ కళాశాల కండలేరు, సైదాపురం కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

## అంత్యక్రియలకు ఆర్థికసాయం : సంయుక్త సేవా సంస్థ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం పొడుంగుంట కాలనీలో నివాసం ఉంటున్న బండి త్రిమూర్తి మృతిచెందారు. వారి అంత్యక్రియల నిమిత్తం సంయుక్త సేవా సంస్థ సభ్యులు ఎస్ఐ ఓట్టూరు శ్రీనివాసులు జి.శాంత వర్ధన్, కే.శ్రీనివాసరావు, తన్నీరు రవికుమార్, ఏఎస్ఐ మార్టూరు పరమే శ్వరి, నేలపాటి వెంకట రమేష్, రామ్మూర్తి సంయుక్త నృత్య కళ నిలయం నాట్య గురువు జి.లిఖితల సహకారంతో గురువారం అతను భార్య అయిన కవితకు సంయుక్త సేవా సమస్త అధ్యక్షులు సురేంద్ర రూ.6వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా అనారోగ్య కారణంగా డయాల్సిస్ చేసుకుంటున్న బండి త్రిమూర్తి ఆరోగ్యం మరింత క్షణించడంతో చనిపోవడం జరిగింది. వారి అంత్యక్రియలకు ఆర్థిక స్తోమత లేక పోవడంతో సంయుక్త సేవా సంస్థ కుటుంబ సభ్యులు వారికి నగదును అందించడం జరిగిందని తెలిపారు. చనిపోయిన వారి గురించి తెలిసిన వెంటనే స్పందించి సహాయం అందజేసిన ప్రతి ఒక్కరు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అతిధులకు ఘనసన్మానాలు




**ఆత్మకూరు, మేజర్ న్యూస్ :** ఆత్మకూరు మండలం కరటం పాడులోని జికెఎన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధ వారం రాత్రి పెద్ద ఎత్తున అత్యంత ఘనంగా నిర్వహిం చిన వార్షికోత్సవ కార్యక్రమంలో అతిథులును ఉపాధ్యాయబృందం ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మానించారు. ఈపాఠశాలకు అన్ని వసతులు కల్పిస్తున్న దాత, గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్ గార్లపాటి వేణుగోపాల్ నాయుడును శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అతిధులుగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ పూనుగుంట రేవతి, మాజీ సర్పంచ్ పఠాన్‌సాబ్జాన్‌ఖాన్, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, పాఠశాల కమిటీ చైర్మెన్ గౌస్‌ఖాన్, కోఆప్షన్‌మెంబర్ హనీఫ్, సీనియర్ జర్నలిస్ట్, ఏపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షుడు, ఎల్ఆర్‌పల్లి జెడ్పిహైస్కూల్ ఎగ్జిక్యూటివ్‌కమిటీ చైర్మెన్ సోమా వెంకటసుబ్బయ్య, తదితరులను ప్రధానోపాధ్యాయుడు ఇ.మాలకొండ రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయబృందం ఘనంగా సన్మానించారు.

# నిరుద్యోగులకు జాబ్‌మేళా సదవకాశం

● 190మందికి ఉద్యోగావకాశాలు ● నియామకపత్రాలు అందజేత ● ఆర్డీఓ పావని

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో జాబ్‌మేళా నిర్వహించడం నిరుద్యోగులకు సదవకాశమని స్థానిక ఆర్డీఓ భూమిరెడ్డి పావని పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరులోని ఆంధ్రా ఇంజనీరింగ్ కాలేజిలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ఆర్డీవో పావని ప్రారంభించారు. ఈసందర్భంగా పావని ప్రసంగిస్తూ నిరుద్యోగులు తమ విద్యార్హతలకు తగిన ఉద్యోగావకాశాల కోసం ఇతరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా మన వద్దనే జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేయడం మంచి అవకాశం, సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈజాబ్ మేళాలో 21 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 306మంది నిరుద్యోగ యువతీయువకులు హాజరుకాగా వివిద కంపెనీల ప్రతినిధులు వారిలో 190మందిని ఉద్యోగాలకు ఎంపికచేశారు. వారికి నియామకపత్రాలను కూడా ఆర్డీవో పావని, మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్‌ల చేతుల మీదుగా అందజేశారు. మరో 17మందికి త్వరలో ఇంటర్వ్యులు




నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్తానిక తహశిల్దారు పి.పద్మజా కుమారి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారు షేక్ అబ్దుల్‌ఖయ్యూమ్, ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ శివకృష్ణ, 21కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువతీయువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు

● అందరికి విద్య అందించడమే లక్ష్యం
● స్కూల్ అభివృద్ధి, విద్యార్థుల ప్రోత్సాహకాలు కొనసాగింపు : గార్లపాటి







**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఉన్నత విద్యతో ఉజ్వలభవిష్యత్తు ఖాయమని, అందరికి విద్య అందించాలన్న లక్ష్యంగా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సాహకాలకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని, భవిష్యత్తులో కొనసాగిస్తామని గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్, మాజీ ఉపమండలాధ్యక్షుడు, బట్టేపాడు పిఏసిఎస్ డైరెక్టర్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం కరటంపాడులోని జికెఎన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని భారీఎత్తున నిర్వహించారు. బుధవారం రాత్రి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇ.మాలకొండరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు పాల్గొన్నారు. ఈపాఠశాలకు దశాబ్దకాలంగా పలు భవనాలు, స్టేజి, సరస్వతి విగ్రహం, మండపం నిర్మించడంతోపాటు ప్రతిఏటా విద్యార్థులకు యూనిఫారం దుస్తులు, నోటుపుస్తకాలు సమకూరుస్తూ పదవతరగతిలో 9.5జిపిఏ మార్కులు సాధించిన విద్యార్థులు కార్పొరేట్ కాలేజిల్లో చదువుకునేందుకు లక్ష రూపాయలవంతున స్కాలర్‌షిప్‌లు అందజేస్తుంటారు. ఆయన గ్రామంలో, మండలంలో ఉచితంగా మినరల్‌వాటర్, వైద్యసేవలు, వికలాంగులకు ఉపకరణాలు అందజేస్తూ అనేక సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తూ సామాజికసేవారత్నగా పేరుగాంచారు. గార్లపాటి ఫౌండేషన్ తరపున గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, ఆయన సోదరులు ల్యాంకో గ్రూప్‌ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ గార్లపాటి భాస్కరనాయుడు, ల్యాంకో డైరెక్టర్ గార్లపాటి సుబ్బారావులు అనేక సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుండడంతోపాటు దాదాపు 4కోట్లరూపాయలు వెచ్చించి తమ స్వగ్రామం కరటంపాడులోని ఉన్నతపాఠశాలను సరస్వతి నిలయంగా, ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్ది విద్యార్థులకు అనేక ప్రోత్సహకాలు అందజేస్తున్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు ప్రసంగిస్తూ తాము కనీసవసతులు లేనిరోజుల్లో ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం గావించి ఉన్నత విద్యతో స్థితిమంతులమై తమవంతుగా పాఠశాలను అభివృద్ధి చేయాలని, పేద,ధనిక తేడాలేకుండా విద్యార్థులకు అన్ని వసతులు, కార్పోరేట్ విద్య లభించాలన్న లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు తామందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోని ఉన్నత విద్యపొంది, ఉజ్వల భవిష్యత్తు పొందితే తామందించే సేవలకు సార్ధకత ఉంటుందన్నారు. గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు అందిస్తున్న సామాజిక సేవలను, పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు అందిస్తున్న చేయూతలను గురించి అతిథులుగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ పూనుగుంట రేవతి, మాజీ సర్పంచ్ పఠాన్‌సాబ్జాన్ ఖాన్, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, పాఠశాల కమిటీ చైర్మెన్ గౌస్‌ఖాన్, కోఆప్షన్‌మెంబర్ హనీఫ్, సీనియర్ జర్నలిస్ట్, ఏపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షుడు, ఎల్‌ఆర్‌పల్లి జెడ్పిహైస్కూల్ ఎగ్జిక్యూటివ్‌కమిటీ చైర్మెన్ సోమా వెంకటసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయుడు మాలకొండరావు, పూర్వ ఉపాధ్యాయుడు పెంచలరెడ్డి తదితరులు వివరించి వారి సేవలను కొనియాడారు. ఈసందర్భంగా విద్యార్థినీ,విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అందరినీ విశేషంగా అలరించాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలందజేశారు. అతిథులను సన్మానించి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు మెమొంటోలు బహూకరించారు. స్కూలు పిడి మాలకొండయ్య, ఉపాధ్యాయుడు మోహన్‌రావులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బి.చిరువెళ్ళ సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ విఆర్వో ఎం.వి.శేషగిరిరావు, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ,విద్యార్థులు, అధికసంఖ్యలో వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరు రూరల్ రాజకీయాల్లో చెరగని ముద్ర**

# దివంగత నేత ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి : రూరల్ ఎమ్మెల్యే

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పొట్టే పాళెం గ్రామంలో దివంగత నేత ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి ఉత్తర క్రియలకు నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొని ఘన నివాళులర్పించడం జరిగింది. నెల్లూరు రూరల్ మండలం లోని పొట్టేపాళెం గ్రామానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నో సేవా కార్యక్రమాలు అందించిన వ్యక్తి దివంగత నేత ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి అన్ని తెలియజేశారు. అదేవిధంగా ప్రసిద్ధిగాంచిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్, పొట్టేపాలెం గ్రామ మాజీ ఉపసర్పంచ్, సాగునీటి సంఘాల అధ్యక్షుడు ఇలా ఎన్నో పదవులు ఆయన నిర్వహించి ప్రజల ప్రశంసలను పొందడం జరిగిందని తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున దివంగత నేత ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి అభిమానులు,



నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అధికారులు ఘనంగా నివాళులర్పించడం జరిగింది.

## అంగన్‌వాడీకేంద్రంలో చిన్నారి జన్మదిన వేడుకలు

● ప్లేట్లు,గ్లాసులు, వాటర్‌క్యాన్ విరాళం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఏ.కృష్యంత్‌శ్రీనివాస్ అనే చిన్నారి జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పి.సునీలత అతిథిగా హాజరుకాగా సూపర్‌వైజర్ జి.కస్తూరి ఆ చిన్నారిచేత కేక్‌కట్‌చేయించి అందరికీ పంచిపెట్టారు. చిన్నారి తల్లిదండ్రులు వెంటకసాయికుమార్, లీలాకృష్ణ, మహేష్, వినీలలు అంగన్‌వాడీ కేంద్ర చిన్నారులకు స్టీలు ప్లేట్లు, గ్లాసులను విరాళంగా అందజేశారు. ఈ కేంద్ర లబ్దిదారులు వై.సుజిత, శ్రీవిహాన్‌రెడ్డిలు అంగన్‌వాడీ కేంద్రానికి కూలింగ్ వాటర్‌క్యాన్‌ను విరాళంగా అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ షకీలా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా గౌరీ శంకరులు గిరి ప్రదక్షణ మహోత్సవం



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా గురువారం భక్త జనులు శివనామస్మరణలతో కైలాస గిరులు ప్రతిధ్వనించాయి. గౌరీ శంకరులు గిరి ప్రదక్షిణ మహోత్సవంతో కైలాసగిరులు పులకించాయి. శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కనుమ రోజున శివ పార్వతులు గిరి ప్రదక్షిణ చేసి బ్రహ్మోత్సవాలకు, తమ వివాహానికి తరలి రండని ముక్కోటి దేవతలకు, కిన్నెర కింపురుషులకు, ఋషులకు, ముని పుంగవులకు, అష్ట పాలకులకు ఆహ్వానం పలికి వచ్చారు. బుధవారం తెల్లవారుజామున ఆ దంపతుల కళ్యాణం జరిగిం. గురురవారం తమ వేడుకలకు విచ్చేసిన వారికి వీడ్కోలు పలికి ఆశీస్సులు అందజేయడానికి గిరి ప్రదక్షణ చేశారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయం నుంచి ఉదయం 8 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి అర్చక గణం కర్పూర హారతులు సమర్పించారు. శివనామస్మరణలతో స్వామి అమ్మవార్లు గిరి ప్రదక్షణకు బయలుదేరారు. ఈవో బాపిరెడ్డి, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, పట్టణ ప్రముఖులు, ఆలయ అధికారులు, సిబ్బం, వేలాదిగా తరలివచ్చిన భక్తులు వెంటరాగా కోలాటాలు భజనలు మంగళ వాయిద్యాలు మిన్నంటగా శివ నామ స్మరణలతో గౌరీ శంకరులు గిరి ప్రదక్షణ అత్యంత వేడుకగా నిర్వహించారు. ఆలయ గోపురం నుంచి పూసల వీధి మీదుగా ఎన్టీఆర్ నగర్, రాజీవ్ నగర్ మీదుగా రమాపురం రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. అక్కడ కొంత విశ్రాంతి తీసుకుని బయలుదేరి వెడాశీ మీదుగా చుక్కల నిడుగల్లు వద్దనున్న ఎదురు సేవ మండపానికి స్వామి అమ్మవార్లు వెంచేశారు. అక్కడికి ఆలయ అధికారులు, అర్చకులు చేరుకొని స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి రాత్రి ఆలయానికి చేరుకున్నారు. గిరి ప్రదక్షణ దారి వెంబడి శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ప్రసాదాలను పంపిణీ చేశారు. పలువురు భక్తులు గిరి ప్రదక్షణకు విచ్చేసిన భక్తులకు అన్నదానాలను మజ్జిగ, నీళ్లను అందజేశారు, కనీ విని ఎరుగని రీతిలో గిరి ప్రదక్షిణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గిరి ప్రదక్షణలో పార్వతీ పరమేశ్వరుల వెంట నడిచి పునీతులయ్యారు. కైలాసగిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ పంపిణీ, ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు జరిగాయి, ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శివ భక్తులు, శ్రీకాళహస్తి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు దీని ప్రదర్శనలో పాల్గొన్నారు.

# నూతన భవనాల అనుమతులు పరిశీలించండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 2వ డివిజన్ గుడిపల్లి పాడు ప్రాంతంలో అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. స్థానికంగా ఉన్న డ్రైన్ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, విద్యుత్ వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర మౌలిక వసతులను అధికారులతో కలిసి పరిశీలించి వివిధ సూచనలు జారీ చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న లేఔట్‌లో నిర్మిస్తున్న నూతన భవనాలకు అనుమతులను పరిశీలించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు మేరకు మాత్రమే భవనాలను నిర్మించేలా పర్యవేక్షించాలని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని రెవెన్యూ వసూళ్లను నిర్దేశించిన సమయంలో పూర్తిగా వసూలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ రెవిన్యూ ఇన్స్పెక్టర్ సిహెచ్ రవి, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కావలిలో వైసీపీ నాయకులు కార్యకర్తలతో విస్తృత సమావేశం



- ముఖ్యఅతిథులుగా మిధున్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కాకాని
- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ఫిబ్రవరి 23వ తేదీన సోమవారం రోజున రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి కళ్యాణ మండపం నందు కావలి మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం వైఎస్‌ఆర్సిపి నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించబడునని అధిక సంఖ్యలో పాల్గొనాలని కావలి వైసీపీ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైసీపీ పార్లమెంటు సభ్యులు, రీజనల్ కోఆర్డినేటర్ మిధున్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. అంతేకాకుండా ఈ సమావేశంలో కార్యకర్తలు ఉద్దేశించి కొన్ని సూచనలు, సలహాలు పార్టీని ఏ విధంగా బలోపేతం చేయాలి, గతంలో జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలలు, ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తదితర అంశాలపై విస్తృతస్థాయి సమావేశం ఉంటుందని తెలిపారు. కావలి నియోజక వర్గంలో ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు, జగన్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## శివపార్వతుల అలకలతోపు ఉత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం మూలాపేట లోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చప్పర ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంకు ఉభయకర్తలుగా కూరపాటి రఘునాధరాజు, జానకి వ్యవరించగా, రాత్రి జరిగిన అలకలతోపు సేవకు ఉభయకర్తలుగా చెరుకుమూడి లక్ష్మీనరసయ్య తరపున సీఎస్‌వీ సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. శివుడు తన ప్రమథ గణాలతో కలిసి తిరుగుతూ, గంగాదేవిని శిరస్సుపై ధరించాడని లేదా వేటకని వెళ్ళి ఆలస్యంగా వచ్చాడని పార్వతీ దేవి అలిగి కోపంతో ఆలయ ద్వారాలు మూసివేస్తుంది. భర్తపై భార్య చూపే ఈ 'ప్రేమపూర్వక కోపమే' ఈ ఉత్సవానికి మూలం. శివ పార్వతులు అంటే కేవలం దైవమే కాదు, వారు 'ఆది దంపతులు'. సంసార జీవితంలో భార్యాభర్తల మధ్య వచ్చే చిన్న చిన్న మనస్పర్థలు సహజమని, వాటిని అనురాగంతో పరిష్కరించుకోవాలని ఈ ఉత్సవం లోకానికి చాటి చెబుతుంది. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు దేవస్తానం వారు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ వేడుకలు పాలక మండలి చైర్మన్ పుట్టా అజయ్ కుమార్‌రెడ్డి, సభ్యులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ సిబ్బంది ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు





**తిరుమల మేజర్‌న్యూస్ :** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు గురువారం ఉదయం దర్శించుకున్నారు. హీరోయిన్ శ్రియా శరన్, డ్రమ్స్ శివమణి, ఓల్డ్ యాక్టర్ రమ్యశ్రీ, నటుడు చరణ్ రాజ్, తెలంగాణ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిలు వేరువేరుగా తదితరులు ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వీరికి ఆలయంలో రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా టిటిడి అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.





వాగ్దానాలకే పరిమితమైన

## బండగానిపల్లి ఘాట్ రోడ్డు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి–బండగానిపల్లి 3.5 కి.మీ ఘాట్ రోడ్డు కేవలం రాజకీయ నాయకుల ఎన్నికల వాగ్దానాలకే పరిమితం అవుతుందని సిపిఎం నాయకులు కాకు వెంకటయ్య ఉద్ఘాటించారు. గురువారం ఉదయగిరి ఎమ్మార్వో కార్యాలయ ఎదుట ఆయన మాట్లాడుతూ.. కేవలం అటవీ అనుమతులు లభించలేదన్న కారణంతో కొండ కింద గ్రామాలను విస్మరించడం సరికాదన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎంపీ, ఎమ్మెల్యే లు స్పందించి 3.5 కి.మీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

జేఈఈ ప్రవేశ పరీక్షలో..

## షేక్ సాయికిరణ్‌కు అత్యధిక మార్కులు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని దూదేకుల ముద్దు బిడ్డ షేక్ సాయి కిరణ్ తండ్రి షేక్ సుబానీ, తల్లి షేక్ సైదా బీ నిన్న వెలువడిన జేఈఈ ప్రవేశ పరీక్షలో 99.41 శాతంతో అత్యధిక మార్కులు సాధించిన సందర్భంగా వారిని కలసి, సాయి కిరణ్‌ను వారి స్వగృహంలో కలసి శాలువాతో సన్మానించి, వారిచే కేక్ కట్ చేయించారు. సాయికిరణ్ భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదవాలని, దూదేకుల సంఘం వారికి ఎల్లప్పుడు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో షేక్ సలీమ్, షేక్ మహబూబ్ బాషా, షేక్ మీరా సాహెబ్, షేక్‌మస్తాన్ (అగ్ని) షేక్ ఖాజావలి, ఎస్.మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ఆరు దుకాణాలను సీజ్ చేసిన

## కార్పొరేషన్ అధికారులు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన దుకాణాలకు సంబంధించి నెలవారీ బాడుగలు, రెన్యువల్ మొత్తాలు చెల్లించకపోవడం, అలాగే అసలు లీజుదారులు కాకుండా ఇతరుల ఆధీనంలో దుకాణాలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో గురువారం చర్యలు తీసుకున్నట్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో జేవిఆర్ షాపింగ్ కాంప్లెక్స్, పాత డైకాస్ట్ రోడ్డు, ఏసీ బొమ్మ షాపింగ్ కాంప్లెక్స్ లలో మొత్తం 6 దుకాణాలు మూసివేశారు.

## నూతన భవన నిర్మాణాలకు పనులు ప్రారంభం

**ఉదయగిరి, మేజర్ న్యూస్ :** ఉదయగిరి విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణంలో నూతన భవనాల నిర్మాణాల కొరకు జంగిల్ క్లియ రెన్స్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ముందుగా ఆ శాఖ ఏఈ చెంగయ్య, బద్వేలకు చెందిన ఎంఆర్‌ఎస్‌ఆర్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గుత్తేదారుడు ఎం.రామసుబ్బారెడ్డిలు టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.1.40 కోట్లకు సంబంధించిన నూతన భవనాల నిర్మాణాల కొరకు ముందుగా జంగిల్ క్లియరెన్స్ చేసి భూమిపూజ నిర్వహించామన్నారు. నిర్దేశించిన గడువులోగా గుత్తేదారుడు భవన నిర్మాణాల పనులును పూర్తి చేయాలని కోరారు.